## కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

నిర్మల్ అర్బన్, జనవరి 9 : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను చట్టం చేయాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని దినాలను కల్పించి రోజూ కూలీ రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కట్ల రాజన్న, రాంలక్ష్మణ్, రాజన్న, కంచన్న, ఎల్లయ్య, దేవరావ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# కేసులకు భయపడం..

- ప్రజల పక్షానే నిరంతరం పోరాటం సాగిస్తాం.. ● మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జనవరి 9 : ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న పోరాటంలో ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజమెత్తారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేశారు. అనంతరం రామన్న మాట్లాడుతూ.. కేటీఆర్‌ను ఎటువంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేశారని మండిపడ్డారు. ఏదీ ఏమైనా ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలు ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాసం నర్సింగరావు, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, సేవ్వా జగదీశ్, గంద్రత్ రమేశ్, రాజన్న, సతీశ్ పవర్, గంబెర్ టక్రే, మారిశెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, మేస్రం పరమేశ్వర్, కుమ్ర రాజు, వేణు యాదవ్, బట్టు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ పూట ధరల మంట



- పరేషాన్ అవుతున్న ప్రజలు ● నూనె, నిత్యావసర ధరలతో ఆర్థిక భారం

ఆదిలాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : పెరుగుతున్న నిత్యావసర ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధరల కారణంగా మధ్య తరగతి, పేదల బతుకులు భారంగా మారుతున్నాయి. చిరు ఉద్యోగులు, కూలీలు, రోజువారి పనులు చేసుకునే వారు ఉపాధి భారంగా మారి అప్పులు చేయాల్సి వస్తుంది. నిత్యావసర సరుకులైన బియ్యం, పప్పులు, వంటనూనెలతోపాటు ఇతర నిత్యావసర ధరలు ఆకాశానంటుతున్నాయి. క్రమంగా పెరుగుతున్న ధరల కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజల ఇళ్లు గడవడం కష్టంగా మారడంతో కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరు పనిచేయాల్సి వస్తుంది. ఇద్దరు సంపాదిస్తున్న కుటుంబపోషణ కష్టంగా మారుతుంది. క్రమంగా పెరుగుతున్న ధరలతో పేదలు, మధ్య తరగతి ప్రజల బతుకు భారంగా మారుతుంది.

### సంక్రాంతికి భారం

ఏటా సంక్రాంత్రి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. ఈ పండుగకు పిండి వంటలు చేస్తారు. సకినాలు, గారెలు, అర్షలు, ఇతర పిండి వంటలు చేసుకుంటారు. పెరిగిన ధరల కారణంగా సామాన్య ప్రజలకు పండుగ భారంగా మారనుంది. గతేడాది పోల్చుకుంటే ధరలు 30 శాతానికి పైగా పెరిగాయి. బాగా పెరిగిన నూనె ధరలను కొనుగోలు చేయాలంటే జనం వణికిపోతున్నారు. నకిలీ వస్తువుల విక్రయాలు ప్రజలను భయపెడుతున్నాయి. జిల్లాలోని కొన్ని పెద్ద దుకాణాల్లో హోల్‌సెల్ పేరిట నకిలీ నూనెలు విక్రయిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. నూనె ధరలు బాగా పెరగడంతో సంక్రాంత్రి సందర్భంగా పిండివంటల తయారీదారులతోపాటు హోటళ్లలో వినియోగానికి ఈ నూనెను ఉపయోగిన్నట్లు తెలుస్తుంది. పెద్ద దుకాణాల్లో ఏదీ నకిలీ, ఏదీ అసలు వస్తువో జనం గుర్తించలేకపోతున్నారు. అధికారులు పండుగ సమయంలో నిత్యావసర సరకులను బ్లాక్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, నకిలీ వస్తువుల విక్రయాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### నిత్యావసరాల ధరలు(కిలో)

| | |
|---|---|
| బియ్యం(మధ్యరకం) | రూ.56 |
| కంది పప్పు | రూ.160 |
| పెసరిపప్పు | రూ.120 |
| పల్లీలు | రూ. 130 |
| వెల్లుల్లి | రూ.400 |
| బెల్లం | రూ.75 |
| పల్లి నూనే (లీటరు) | రూ.180 |
| సన్ ఫ్లవర్ | రూ.145 |
| పామాయిల్ | రూ.120 |









మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ సౌజన్య

# మీ హక్కులను కాపాడడానికి మేమున్నాం

- డీఎల్ ఎస్ఏ సెక్రటరీ సౌజన్య

తాంసి, జనవరి 9 ః బాల బాలికల హక్కులను కాపాడడానికి మేమున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బోనగిరి సౌజన్య అన్నారు. గురువారం తాంసి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత భారతదేశం అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ.. లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవలు అందించేందుకు పారా లీగల్ వలంటరీస్‌ను నియమించినట్లు తెలిపారు. బాల కార్మికులు లేని, బాల్య వివాహాలు లేని, బాలల అక్రమ రవాణా లేని గ్రామాలుగా మారుద్దామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చదువును మధ్యలో మానేయవద్దన్నారు. అనంతరం అతిథులను షూర్ ఎన్జీవో డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కె.వినోద్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకట్ స్వామి, జిల్లా బాలల రక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్, మహిళా సాధికారత జిల్లా కో-ఆర్డినేటర్ పవర్ యశోద, ఎంఈవో శ్రీకాంత్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, షూర్ ఎన్జీవో ఫీల్డ్ సూపర్‌వైజర్ కిరణ్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్, పీడీ జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వరి నాట్లు వేస్తున్న కూలీలు

## ❖ నాట్లకు అంతర్రాష్ట్ర కూలీలు

*వరినాట్లు ఊపందుకున్నాయి. స్థానిక కూలీలు అందుబాటులో లేకపోవడంతో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల కూలీలను బృందాలుగా తీసుకొచ్చి రైతులు నాట్లు వేయిస్తున్నారు. స్థానిక కూలీలు రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు డిమాండ్ చేస్తుండగా.. వలస కూలీలు మాత్రం రూ.4 వేలకే వస్తున్నారు. రోజుకు ఐదు నుంచి పదెకరాల వరకు నాట్లు వేస్తున్నారు. ఉదయం ఐదు గంటలకే వారు పొలాల్లోకి వెళ్లి పని ప్రారంభిస్తారు. నాలుగైదు ఏండ్లుగా వలస కూలీలతో రైతులు నాట్లను వేయిస్తున్నారు. - లోకేశ్వరం, జనవరి 9*



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

# స్పోర్ట్స్ మీట్ మానసికోల్లాసం కలిగిస్తుంది

- కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 9 : పోలీసులు నిత్యం విధుల ఒత్తిడిలో ఉంటారని, వారికి స్పోర్ట్స్ మీట్ మానసికోల్లాసం కలిగిస్తుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా పోలీసుల వార్షిక క్రీడా పోటీలను ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి ప్రారంభించారు. ఏఆర్ హెడ్‌కార్వ్యర్టర్స్‌లో ముందుగా పోలీసులు, క్రీడాకారుల నుంచి గౌరవందనం స్వీకరించారు. అనంతరం గాలిలో బెలూన్స్, పావురాలను విడుదల చేసి స్పోర్ట్స్ మీట్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయా క్రీడాల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అంతకు ముందు క్రీడా జెండాను ఆవిష్కరించి క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. క్రీడల వల్ల మానసిక, శరీరక ధృడత్వం కలుగుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. ఫిజికల్, మానసిక ఒత్తిడికి లోనుకాకుండా వారి కోసం యేటా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సురేంద్రరావు, ఉట్నూర్ అసిస్టెంట్ ఎస్పీ కజల్, డీఎస్పీలు జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ గోవర్ధన్

## ఆర్జీయూకేటీలో ఇన్ఫ్యూషన్ టాక్స్ కార్యక్రమం

బాసర, జనవరి 9 : బాసర ఆర్జీయూకేటీలో గురువారం ఆవిష్కర్తలుగా ఎదగడం ఎలా అనే అంశంపై ఇన్ఫ్యూషన్ టాక్స్ వేదిక ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ.. ఇన్ఫ్యూషన్ టాక్స్‌ని నిర్వహించడం ఆనందంగా ఉందని, విద్యార్థులకు పరిశ్రమ నిపుణులతో సంభాషించడానికి, వారి అనుభవాల నుంచి నేర్చుకునే ప్రత్యేక అవకాశాన్ని అందుకోవడం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. ముఖ్య అతిథులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవోశ్రీ రణధీర్‌సాగి, ఐఐఈడీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్‌రెడ్డి, స్వప్నిల్ పాల్గొన్నారు.

## ఇసుక రవాణా నియంత్రణకు చర్యలు

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 9 : ఇసుక అక్రమ రవాణ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, ధరణి దరఖాస్తుల పరిష్కారం, రెవెన్యూ అంశాలపై అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. మండలాలవారీగా నది, వాగులు వంటి ఇసుక అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించాలని.. రహదారులు, భవనాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాల వంటి వాటికి ప్రభుత్వ రికార్డులను పరిశీలించి ఇసుక అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ సుదర్శన్, ఈడీఎం నదీం పాల్గొన్నారు.

# రెండో బెటాలియన్‌కు 412 మంది కానిస్టేబుళ్లు

ఎదులాపురం, జనవరి 9 : తెలంగాణ ప్రభుత్వం పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో శిక్షణ పూర్తి చేసుకుని, 412 మంది కానిస్టేబుల్స్ రెండో బెటాలియన్‌లో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా గురువారం కమాండెంట్ నితికపంత్ వారిని ఆహ్వానించి, అభినందలను తెలిపారు. అలాగే నూతన కానిస్టేబుళ్ల విధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పెద్దబాబు, అసిస్టెంట్ కమాండెంట్‌లు చౌహాన్, ఏజేపీ నారాయణ, దేవీదాస్ రాథోడ్, ఏవో సుభాషిణి పాల్గొన్నారు.



నూతన కానిస్టేబుళ్లకు విధుల గురించి వివరిస్తున్న కమాండెంట్ నితిక పంత్

# లూయిస్ బ్రెయిలీ జయంతి



కేక్ కట్ చేసి తినిపిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 9 ః లూయిస్ బ్రెయిలీ 160వ జయంతిని గురువారం జిల్లాకేంద్రంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజార్షి షా పాల్గొని లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బ్రెయిలీ వైకల్యాన్ని జయించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బి.సబిత, ఏసీడీపీవో కె.మిల్కా పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బందికీ టీబీ పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జనవరి 9 ః అనునిత్యం విధుల్లో నిమగ్నమై ఉండే జిల్లా పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం టీబీ పరీక్షలను ప్రారంభించారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ పరీక్షల్లో పాల్గొని తమ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణిపై శిక్షణ

ఎదులాపురం, జనవరి 9 ః సీఎం ప్రజావాణికి ఆదిలాబాద్ జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్జీల స్వీకరణపై తహసీల్దార్లు, గ్రీవెన్స్ రెడ్రెసెల్, కిసాన్ మిత్ర అధికారులు, ప్రత్యేకాధికారులకు కలెక్టర్ రాజర్షి షా దిశానిర్దేశం చేశారు. సీఎం ప్రజావాణి త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో కీలక అంశాలు, పబ్లిక్ హియరింగ్, ఫిర్యాదుల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెసెల్ అధికారులను నియమించామన్నారు. 30 రోజుల్లో దరఖాస్తుదారుడి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈనెల 20 నుంచి సీఎం ప్రజావాణిని అధికారులు ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీవో వినోద్‌కుమార్, ప్రజా సంఘాల నుంచి శంకర్, కొండల్, విఠల్ రావ్, అమరేందర్, సఫర్ టీమ్, రక్షిత, కరీనా కిసాన్ మిత్ర టీమ్, హర్ష, రమాకాంత్, రాకేశ్, వినాయక్ అండ్ టీమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



భీంరావ్(ఫైల్)

ఇంద్రవెల్లి, జనవరి 9 ః విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన గురువారం శంకర్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడలో చోటు చేసుకున్నది. బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలంలోని దావేన్‌గూడ గ్రామానికి చెందిన మడావి బాజీరావ్-మాడ్కుబాయి దంపతుల ఏకైక కుమారుడు మడావి భీంరావ్(26) డిగ్రీ పూర్తి చేసి తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో తోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో దుబ్బగూడ గ్రామంలో ఉంటున్న తన అక్క యేర్మ సీతాబాయి గ్రామానికి వెళ్తానని ఇంట్లో చెప్పి రెండు రోజుల క్రితం వెళ్లాడు. గురువారం తన అక్క ఇంట్లో ఉన్న ఊయ్యాల తాడును తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురికావడంతో తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన బంధువులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి కొన ఊపిరితో ఉన్న భీంరావ్‌ను మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

## చైనా మాంజాను విక్రయిస్తే చర్యలు

ఇంద్రవెల్లి, జనవరి 9 ః జనరల్ స్టోర్లతోపాటు దుకాణాల్లో చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ టాస్క్‌ఫోర్స్ ఆదిలాబాద్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని జనరల్ స్టోర్స్‌తోపాటు పతంగులు, మాంజాలను విక్రయిస్తున్న దుకాణాలను తనిఖీ చేశారు. చైనా మాంజాతో అటవీ జంతువులతోపాటు పక్షులకు జరుగుతున్న ప్రమాదాలతోపాటు వాటి మరణలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైనా మాంజాను అమ్మిన యాజమానులకు సూచనాలు చేశారు. వాడితే, అమ్మితే రూ. ఒక లక్షల జరిమానాతోపాటు ఐదేండ్ల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ ఆర్వో కవిత, రాజేందర్, ఇంద్రవెల్లి ఎఫ్ఎస్వో చంద్రారెడ్డి, ఎఫ్‌బీవోలు సజన్‌లాల్, శ్యాంసుందర్, టీపే సంజయ్ పాల్గొన్నారు.



జనరల్ స్టోర్‌లో పరిశీలిస్తున్న అధికారులు